అనుదినం జనపక్షం www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 26 జులై 2023

రోడ్డుకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వాలని ధర్నా



దహెగాం : మండలంలోని కల్వాడ నుండి కొంచవెల్లికి వెళ్లే ప్రధాన రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు ఇవ్వాలని కోరుతూ కొంచవెల్లి గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. గ్రామం నుండి ఫారెస్టు నర్సరీకి మొక్కలతో వెళ్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామానికి ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారి తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ రోడ్డు పునర్ నిర్మాణం కోసం నిధులు మంజూరైనా అటవీ శాఖ అధికారులు అనుమతులు ఇవ్వకపోవడం సరికాదన్నారు. వెంటనే అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఐ సనత్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని చెప్పడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో నాయకులు రౌతు రాజన్న, గడ్డం తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

యువ భారత్‌శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని చౌతపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు యువ భారతి శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఇన్‌చార్జి మాట్లాడుతూ పేదరికం చదువుకు అడ్డు కాకూడదని, చదువు ఒక్కటే జీవితంలో వెలుగు నింపుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాల అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో జీవన్‌కుమార్, రోషన్, చంద సురేష్ పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో పర్సువాడ

- మౌలిక సదుపాయాలు కరువు
- ఇబ్బందులు పడుతున్న గిరిజనులు

గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని ప్రగల్భాలు పలుకుతున్న పాలకులు మారుమూల గ్రామాలను అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహస్తున్నారని చెప్పడానికి మండలంలోని పర్సువాడ గ్రామమే నిర్శనం. సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకు విశ్వాంతరాలకు దూసుకుపోతున్నా మారుమూల గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక గిరిజనలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఎన్నికల సమయంలో మారుమూల గ్రామాలను వెతుక్కుంటూ వెళ్లి ఓట్లు అడిగే నాయకులకు అధికారం వచ్చాకా ఆ గ్రామాలవైపు చూడటం లేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76ఏండ్లు గడుస్తున్నా మారుమూల గ్రామాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా దాపురించింది.



నవతెలంగాణ-కెరమెరి

మండంలోని కేలి(బి) పంచాయతీ పరిధిలోని పర్సువాడ గ్రామస్తులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోక బాహ్య ప్రపంచానికి దూరంగా ఎత్తయిన గుట్టలపై గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. మండల కేంద్రం నుండి సుమారు 11కిమి దూరంలో ఉన్న ఈ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేదు. కెరమెరి నుండి 7కిమి దూరంలో ఉన్న కేలి-బి గ్రామం వరకు బీటీ రోడ్డు సౌకర్యం ఉంది.

నాలుగు కిలోమీటర్లు కాలినక

కేలి-బి గ్రామం నుంచి నాలుగు కిలోమీటర్లు కాలి నడకన వెళ్లక తప్పదు. మూడు ఎత్తైన గుట్టలు, దారి పొడవునా గుంతలు, రాళ్లు, రంపల మధ్య కాలినడక వెళ్లడం నరకయాతన పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం ఏర్పడి సుమారు 45 ఏండ్లు దాటింది. 35 కుటుంబాలు, 155 మంది జనాభా నివసిస్తున్న ఈ గ్రామంలో గిరిజన బంజారా తెగకు చెందిన ప్రజలు నివసిస్తున్నారు. నేటికి చేతి పంపు కూడా లేదంటే గ్రామంలో అభివృద్ధి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏళ్ల క్రితం గ్రామస్తులు నిర్మించుకున్న పురాతన బావి, మిషన్ భగీరథ నీళ్లపైన ఆధారపడుతున్నారు. భగీరథ నీళ్ల సరఫరాలో అంతరాయం ఏర్పడితే బావి నీళ్లే దిక్కవుతున్నాయి. గ్రామస్తులు పోడు వ్యయసాయం చేస్తూ వర్షాధారిత పంటలు పండిస్తూ జీవిస్తున్నారు. భూమి లేనటువంటి వారు వ్యయసాయ కూలీలుగా జీవనం కొనసాగిస్తున్నారు. ఏళ్లుగా గ్రామంలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో అభివృద్ధి ఇసుమంతైనా కానరాదు. అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షాలకు గ్రామమంత బురదమయంగా మారుతుంది. అడుగు బయట వేయడానికి వీలులేకుండా ఉంటుంది. దీంతో గ్రామస్తులకు ప్రతి ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడం లేదు.

వలసబాట పట్టిన గ్రామస్తులు

పదేళ్ల క్రితం 40 కుటుంబాలతో గ్రామమంతా కళకళలాడేది. మౌళిక సదుపాయాలు లేకపోవడంతో కొన్ని కుటుంబాలు, గోలేటి, అనార్‌పల్లి, ఖైర్‌గూడ, కోసర గ్రామాలకు తరలి వెళ్లారు. ఇప్పటికి ఈ గ్రామంలోని ప్రజలు కర్రలతో నిర్మించుకున్న ఇండ్లలో నివసించడం గమనార్హం. వృద్దులు రేషన్ బియ్యం, పింఛన్ కోసం ఎలాగోలా గుట్టలు దిగి వచ్చినప్పటికి తిరిగి గ్రామానికి వెళ్లేందుకు తిప్పలు పడక తప్పడం లేదు. గ్రామంలో పాఠశాల భవనం లేకపోవడంతో గ్రామస్తులు కర్రలతో ఓ గుడిసెను నిర్మించారు. ప్రస్తుతం ఆ షెడ్డులోనే పాఠశాల కొనసాగుతోంది. వర్షాకాలంలో ఉపాధ్యాయులు కిలోమీటరు దూరం వరకు బురదలో నడిచి వెళ్లక తప్పడం లేదు.

అత్యవసర సమయాల్లో అరిగోస

ఎతైన గుట్టలపై ఉన్న తాము అత్యవసర సమయాల్లో అనేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. రోడ్డు సౌకర్యం లేని కారణంగా వాహనాలు రాలేని దుస్థితి. దీంతో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, గర్భిణులను ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు గ్రామస్తులు అష్టకష్టాలు పడుతున్నారు. 3కిలోమీటర్ల దూరం వరకు గుట్టలు ఉండడంతో వారి బాధలు వర్ణనాతీతం. ఎన్నికల సమయంలో వచ్చి ఓట్లు వేయించుకుంటున్నారే తప్ప మౌలిక సదుపాయాలు కల్పించడంపై దృష్టి సారించడలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

బీటీ రోడ్డు మంజూరు చేయాలి : బాలు, గ్రామస్తుడు



రోడ్డు సౌకర్యం లేక ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పలుమార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఎన్నో ప్రభుత్వాలు మారినా రోడ్డుకు మోక్షం కలగడం లేదు. దీంతో రాకపోకలకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నికల సమయంలో నాయకులు ఇచ్చిన హామీలు నేరవేర్చడం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయాలి.

మౌలిక సదుపాయాలు కల్పించాలి : చౌహాన్ చంచేలా, గ్రామస్తురాలు



గ్రామంలో ఏళ్లతరబడి సమస్యలు పరిష్కారం కావడం లేదు. అంతర్గత రోడ్ల నిర్మాణం లేకపోవడంతో చినుకు పడితే చాలు చిత్తడిగా మారుతోంది. బురదలో నడవలేకపోతున్నాం. నేటికీ మురికి కాలువల నిర్మాణం చేపట్టకపోవడం నీరంతా ఇండ్ల చుట్టూ చేరుతోంది. దీంతో దోమలతో వ్యాధుల బారిన పడుతున్నాం. అధికారులు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలి.





వరద తగ్గింది.. ఇసుక రవాణా మొదలైంది

- కూలిన బ్రిడ్జి పిల్లర్ సమీపం నుండే ఇసుక తవ్వకాలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

వంతెనలు కూలినా, రోడ్లు చెడిపోయినా, నెలల తరబడి రాకపోకలు నిలిచిపోయినా మాకేంటి.. మా ఇసుక మాకు దక్కితే చాలు అనే విధంగా ఉంది కాగజ్‌నగర్‌లోని ఇసుక వ్యాపారుల పరిస్థితి. ఇసుక మాఫియా కారణంగానే కాగజ్‌నగర్ మండలంలోని అందవెల్లి పెద్దవాగు వంతెన కుప్పకూలిందనేది బహిరంగ రహస్యమే. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ వంతెన వద్ద పెద్దవాగు ఉధృతంగా ప్రవహించింది. మంగళవారమే ఈ వరద ఉధృతి తగ్గింది. ఇంకేముంది ఇసుక వ్యాపారులు రంగప్రవేశం చేశారు. కూలిన వంతెన పిల్లర్ల సమీపం నుండే ఇసుక తరలింపును ప్రారంభించారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక తరలింపును ప్రారంభించారు. అయినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం పట్ల పలువురు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టాలని నిరసన



తాండూర్ : బెల్లంపల్లి పట్టణం బజార్ ఏరియా శిశు మందిర్ ఉన్నత పాఠశాల రోడ్డు నుండి కాశిరెడ్డిపల్లి వరకు అధ్వానంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. 3వ వార్డులోని అంబేద్కర్‌నగర్ రోడ్డులో ఏర్పడిన భారీ గుంతలలో వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు బెల్లంపల్లి పట్టణం నుండి గ్రామాలకు అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డును సంబంధిత మున్సిపాలిటీ, మండల ప్రజాపరిషత్ కార్యాలయ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే చొరవ తీసుకొని ఈ రోడ్లకు మరమ్మత్తులు చేయించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో నాయకులు నాతరి స్వామి, బండి ప్రభాకర్, సిలివేరి సత్యనారాయణ, ఎండి అఫ్జల్, తొంగల మల్లేష్, సోకాల రవి, మోత్కూరు నారాయణ పాల్గొన్నారు.

పాఠశాల స్థాయిలో పరిశోధన ఆసక్తి పెంచాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థుల్లో పాఠశాల స్థాయిలోనే పరిశోధన ఆసక్తిని పెంచినప్పుడు మాత్రమే వారు జాతీయ స్థాయి కళాశాలలో ప్రవేశం పొంది పరిశోధనా రంగం వైపు పయనిస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి పార్సి అశోక్ అన్నారు. ఇన్‌స్పైర్ నామినేషన్లకు సంబంధించి జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులకు ఉపాధ్యాయులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో పరిశోధన ఆసక్తి పెంచడానికి ఇన్‌స్పైర్ నామినేషన్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేసి అన్ని యాజమాన్యాలకు సంబంధించిన ప్రతి పాఠశాల నుండి ఐదు నామినేషన్లు వేయాలని సూచించారు. చివరి వరకు వేచి చూడకుండా ఈ నెల 31 లోపల నామినేషన్లను పూర్తి చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా లక్ష ప్రాజెక్టులను, రాష్ట్రవ్యాప్తంగా 10000 ఉత్తమ ప్రయోగాలు ఎన్నిక చేయబడతాయని, వీటిలో ఎన్నికైన ప్రతి ఒక్క ప్రాజెక్టుకి రూ.10000 కేటాయిస్తారని తెలిపారు. ఈ మొత్తం ప్రాజెక్టు తయారీకి వినియోగించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ డబ్బులను కేంద్ర ప్రభుత్వం నేరుగా విద్యార్థి అకౌంట్లో వేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ అధికారి కటకం మధుకర్, మంచిర్యాల జిల్లా సైన్స్ అధికారి మధుబాబు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్ : వ్యక్తిగత శుభ్రతతో పాటు ప్రతి ఒక్కరూ పచ్చదనం పరిశుభ్రతకు పాటు పడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ సూచించారు. పట్టణంలోని పలు కాలనీలలో మంగళవారం విస్తృతంగా పర్యటించి ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మార్కెట్ యార్డ్ నుండి తాటిగూడ వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించారు. తాటిగూడ, మహాలక్ష్మివాడ కాలనీల్లో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ సిసి రోడ్ పనులను పరిశీలించారు. పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట కౌన్సిలర్ అశోక్ స్వామి, పందిరి భూమన్న, సంజయ్, నాయకులు కొండ గణేష్, ఏఈ తిరుపతి ఉన్నారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

బెజ్జూర్ : బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని ఎస్ఐలు కళ్యాణ్, విక్రమ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు దుకాణాలను ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా పరిశీలించారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవద్దని యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. 18 సంవత్సరాలలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి వెంట కౌన్సిలర్ చంద్రశేఖర్, జమున, సిబ్బంది తిరుపతి, అమీర్ ఉన్నారు.

బదిలీపై వెళ్లిన ఎస్ఐకి సన్మానం

బెజ్జూర్ : బదిలీపై వెళ్లిన ఎస్ఐ వెంకటేశ్‌ను మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో పలువురు నాయకులు సన్మానించారు. కోఆప్షన్ సభ్యుడు బషరత్‌ఖాన్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఓంప్రకాష్, నాయకులు వెంకన్న, సకారాం, నరేందర్‌గౌడ్, రామకృష్ణ, జైద్ అలీ, మహేష్ పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు-పొంగిపొర్లుతున్న వాగులు

జైపూర్ : మండలంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. సోమవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో పాటు మంగళవారం మధ్యాహ్నం వరకు ఏకధాటి వానతో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. గోదావరి నది నిండుగా ప్రవహిస్తుండగా వేలాల శివారు పుష్కరఘాట్ వరకు వరద నీరు కమ్ముకుంది. పెగడపల్లి శివారు ఈదుల వాగు పొంగిపొర్లడంతో ఐదారుగంటల వరకు జైపూర్-పెగడపల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా కుందారం-రుమ్మీపూర్ మధ్య వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎగువ నుండి వచ్చే వరద నీటిని సుందిళ్ల బ్యారేజ్ గేట్లు ఎత్తి దిగువకు వదలుతున్నారు. రానున్న 48గంటల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గోదావరి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మోహన్‌రెడ్డి తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు పెట్టుకోవద్దని, శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉండొద్దని కోరారు.

గిరిజన మహిళలపై దారుణాలకు బీజేపీదే బాధ్యత

- ఆదివాసులను అక్కడి నుండి వెళ్లగొట్టే కుట్ర చేసిన ఆర్ఎస్ఎస్, బీజేపీ : సీపీఐ, సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ - హాజీపూర్



మణిపూర్‌లో గిరిజన మహిళలపై జరిగిన దారుణాలకు బీజేపీ బాధ్యత వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేని శంకర్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. మణిపూర్‌లో కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో సీపీఐ, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో 85 రోజులుగా మారణ హోమం జరుగుతుంటే మోడీ విదేశీ పర్యటనలు చేయడం సిగ్గు చేటని పేర్కొన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలిని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని, శాంతి భద్రతలు కాపాడాలని దేశం మొత్తం నిరసనలు జరుగుతున్నా మోడీకి వినబడడం లేదా అని ప్రశ్నించారు. అక్కడి నుండి ఆదివాసీ గిరిజనులను వెళ్లి పోయేలా చేసి ఆ ప్రాంతాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కుట్ర జరుగుతోందన్నారు. మణిపూర్‌లో అర్ఎస్ఎస్, బిజేపీ పెట్టిన మంటల్లో రాష్ట్రం తగలబడుతుంటే రోమ్ చక్రవర్తిలాగా మోడీ, అమిత్‌షా వ్యవహరిస్తున్నారన్నారు. మణిపూర్‌లో గిరిజన మహిళలపై జరిగే ఆకృత్యాలు జాతీయ మహిళా కమిషన్‌కు కనపడటం లేదా అని ప్రశ్నించారు. బీజేపీ అగ్రవర్ణాల ప్రభుత్వమని మణిపూర్ ఘటనతో మరోసారి తేటతెల్లమైందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ప్రకాష్, ఎర్మ పున్నం, మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, ఇప్పకాయల లింగయ్య, జోగుల మల్లయ్య, వజ్ర, లింగం రవి, మిట్టపల్లి శ్రీనివాస్, పౌల్, లక్ష్మినారాయణ, ప్రేమ్‌కుమార్, సమ్మక్క, రజిత, శ్రావణ్, మోహన్, హన్మంతరెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు.

జైపూర్ : మణిపూర్‌లో అల్లర్లకు కారకుడైన సీఎం బీరేన్‌సింగ్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. మణిపూర్ మహిళలకు సంఘీభావంగా మంగళవారం చెన్నూర్ పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో ఆర్ఎస్ఎస్, బీజేపీ పెట్టిన మంటల్లో రాష్ట్రం తగలబడుతుంటే రోమ్ చక్రవర్తిలాగా మోడీ, అమిత్‌షాలు వ్యవహరిస్తున్నారని అన్నారు. వేల మంది నిరాశ్రయులవుతుండగా 150 మంది సామాన్య ప్రజలు మరణించారన్నారు. కోట్లాది రూపాయల ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. గిరిజన తెగల మధ్య శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బోడంకి చందు, పట్టణ కార్యదర్శి ఎండీ అవేజ్, మహిళ నాయకులు ఉమారాణి, సంధ్య, సమ్మక్క, సరిత, రేణుక, ప్రసన్నకుమార్, శేఖర్‌చారి, రుక్సానా, మనక్క, భూదక్క, నాగజ్యోతి, రమ్య పాల్గొన్నారు.

తాండూర్ : గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి లైంగిక దాడి చేసిన దుండగులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని సీపీఐ(ఎం) మండల కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం తాండూర్ ఐబిలో రాస్తారోకో చేశారు. పార్టీ మండల కార్యదర్శి దాగం రాజారాం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు దుర్గం నానయ్య, వేల్పుల శంకర్, బొల్లం రాజేశం పాల్గొన్నారు.



జైపూర్ : చెన్నూర్‌లో ర్యాలీ

జన్నారంలో కలెక్టర్ విస్తృత పర్యటన

- రేండ్లగూడలో శ్మశాన వాటికలో మొక్కలు నాటిన కలెక్టర్
- ప్రభుత్వాస్పత్రి తనిఖీ

జన్నారం : కలెక్టర్ బాదావత్ సంతోష్ నాయక్ మంగళవారం మండలంలో పర్యటించారు. ముందుగా రేండ్లగూడ గ్రామంలో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలను పరిశీలించి ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని సూచించారు. గ్రామంలో శ్మశాన వాటిక, డంపింగ్ యార్డ్‌లను పరిశీలించి అక్కడ మొక్కలు నాటారు. వీటి నిర్వహణ, ఉపయోగాలను సర్పంచ్ నెమలికొండ ఆశరాజ్, కార్యదర్శి శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసి ఆరోగ్య మహిళా కార్యక్రమంపై ఆరా తీశారు. ప్రతి మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఉషాశ్రీకి సూచించారు. హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి సక్రమంగా విధులకు హాజరు కావాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మండలంలోని దేవునిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తూరుపల్లెలో గోబర్ గ్యాస్ ప్లాంటును పరిశీలించారు. రాష్ట్రంలోనే ఈ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో గోబర్ గ్యాస్ ప్లాంటును ఏర్పాటు చేయడం జరిగిందని, దాని ఉపయోగాలు నిర్వహణను డిఆర్డిఓ శేషాద్రి, ఎంఈఓ విజయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ రాహుల్, అసిస్టెంట్ కలెక్టర్ గౌతమి, డీఈఓ యాదయ్య, ఎంపీపీ మాదాడి సరోజన, ఎంపీడీవో అరుణారాణి, ఎంఈఓ విజయ్‌కుమార్, ఏపీవో రవీందర్ పాల్గొన్నారు.



ఎస్సీ గురుకులాన్ని వేరే చోటికి తరలించాలి



నవతెలంగాణ-హాజీపూర్

అండాలమ్మ కాలనీలో ఉన్న సోషల్ వెల్ఫేర్ గురుకులాన్ని వేరే చోటికి తరలించాలి ఆర్‌సిఓకు వామపక్ష విద్యార్థి సంఘాలు వినతిపత్రం అందజేశాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అండాలమ్మ కాలనీలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల విద్యార్థులు అవస్థలు పడుతూ ఉంటున్నారన్నారు. అక్కడ చెత్త డంపింగ్ యార్డ్ ఉండడం వల్ల దుర్వాసన, పొగతో చాలా ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు అసౌకర్యంగా ఉన్న గురుకులాన్ని వేరే చోటికి మార్చే విధంగా చొరవ చేయాలని కోరారు. కొంతమంది టీచర్లు, పీఈటీ, ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వీరిపై తక్షణమే అధికారులు చర్యలు తీసుకొని విద్యార్థులకు సౌకర్యాలు కల్పించే విధంగా హాస్టల్‌ను వేరే చోటుకు మార్చాలని డిమాండ్ చేశారు. లేనియెడల జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కనుకుంట్ల సన్నీగౌడ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్, తిరుపతి పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని 33వ వార్డు పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వయం సహకార సంఘం కమ్యునిటీ హాల్ శిలాఫలకాన్ని ఆవిష్కరించి కమ్యునిటీ హాల్‌ను లాంచనంగా ప్రారంభించారు. ఆదేవిధంగా సీసీ రోడ్లు, డ్రైనేజ్ నిర్మాణాలతో పాటు వార్డులోని సవారి బంగ్లా షెడ్‌ను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహరం పండగను ఘనంగా జరుపుకునేందుకు తగు సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. దాదాపు 7కోట్ల నిధులతో సవారి బంగ్లాలు, షెడ్ల నిర్మాణాలు చేపట్టినట్లు వెల్లడించారు. గతంలో ప్రజలు ఎదుర్కొన్న అనేక ఇబ్బందులకు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపిందన్నారు. ఆసరా పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి బృహత్ పథకాలు దేశంలోని మరే ఇతర రాష్ట్రంలో అందడం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కౌన్సిలర్ అలాల్ అజయ్, రైతుబంధు సమితి అధ్యక్షులు రోకండ్ల రమేష్, మైనార్టీ నాయకులు సలీం పాషా, అశోక్, లలిత, మున్సిపల్ కమిషనర్ శైలజ పాల్గొన్నారు.

సర్‌సిల్క్‌లో చోరీ

కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్‌లోని సర్‌సిల్క్‌లో నివాసముండే ప్రైవేట్ కార్మికుడు జమీల్ ఇంట్లో మంగళవారం చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన ప్రకారం జమీల్ తన భార్య అనారోగ్యం కారణంగా సోమవారం మంచిర్యాల ఆసుపత్రికి వెళ్లాడు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తాళం పగులకొట్టి ఉండడంతో చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. ఇంట్లోని బీరువా తలుపును పగులకొట్టి అందులోని మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ. 5 వేల నగదును అపహరించారు. సంఘటనాస్థలాన్ని టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్ పరిశీలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వాన్వట్ హాస్టల్‌లో మెడికల్ క్యాంపు

నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్



మండలంలోని వాన్వట్ హాస్టల్‌లో మంగళవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, మాత్రలను అందజేశామని డాక్టర్ రాహుల్ గడపాలే తెలిపారు. మెడికల్ క్యాంపు కార్యక్రమంలో హాస్టల్‌లోని వంటగదిని పరిశీలించి, పరిశుభ్రత పాటించాలని అన్నారు. వర్షాకాలంలో చుట్టు కూర్చుండే ప్రాంతం, పడుకునే ప్రాంతం వెచ్చగా ఉంచుకోవాలని, పొడి బట్టలను ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పవర్ ప్రేమ్‌సింగ్, ఇందుబాయి, సుశీల, ఆశా కార్యకర్త మరప సుమిత్ర, ప్రధానోపాధ్యాయులు నిశికాంత్, వార్డెన్ ప్రతిమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

నవతెలంగాణ-తలమడుగు



గుండెపోటుతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని ఉండం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఉండం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బొండ్ల మధుకర్ కుమారుడు నవీన్(21) మంగళవారం ఉదయం సవారీ బంగ్లా వైపు వెళ్లి, చాతినొప్పిగా ఉండటంతో ఇంటికి వచ్చి, కుటుంబీకులకు తెలిపాడు. వారు వెంటనే రిమ్స్‌కు తరలించారు. ో చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు.

ఫిట్స్‌తో బాలింత మృతి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



మండలంలోని మర్ణగూడకు చెందిన బాలింత కాంబ్లే సోనాలి(22) రిమ్స్‌లో ప్రసూతి అయిన తదుపరి ఫిట్స్ రావడంతో మరణించినట్లు బంధువులు తెలిపారు. మర్కగూడకు చెందిన గాయక్వాడ్ అశోక్ కూతురు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఇటీవల డెలివరికి తల్లి గారి ఊరు మర్కగూడకు రాగా, సోమవారం నాడు పురిటినొప్పులు రావడంతో రిమ్స్‌కు తరలించారు. అక్కడ సుఖ ప్రసవం అయిన తరువాత ఫిట్స్ రావడంతో మరణించినట్లు బంధువులు తెలిపారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌లో మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డు బంగారుగూడ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్డీఓ స్రవంతికి వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో అక్రమ్‌ఖాన్, మహేష్, శ్రీనివాస్ ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-కుభీర్

వర్ష కాలంలో అధికంగా వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యులు వసుంధర అన్నారు. మంగళవారం మండలంలోని డోడార్నా ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగహన కల్పించారు. పాఠశాల విద్యార్థులు పాఠశాలలో ఉన్న సదుపాయాలు వినియోగించుకొవాలని అన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపర్‌వైజర్ సాయిబాబా, సిబ్బంది శ్రీనివాస్, ప్రేమ్‌సింగ్, ఊర్మిల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆస్పత్రి సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

సమాచార హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్న డీడీపీ బిల్లు

నవతెలంగాణ-బోథ్



కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఈ వర్షాకాల సమావేశాల్లో భాగంగా ప్రవేశపెట్టబోతున్న డీడీపీ బిల్లు డిజిటల్ డాటా ప్రోడక్షన్ బిల్, 2022 కొన్ని అంశాలు సమాచార హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నాయని ఆర్టీఐ అక్టివిటిస్ట్ షేక్ షాకిర్ అన్నారు. మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం, 2005 ద్వారా ప్రభుత్వ యంత్రాంగం పనితీరు, పారదర్శకతపై దేశ పౌరులకు ఆజమాయిషి ఉంటుందని అన్నారు. అలాగే ప్రజాస్వామ్యానికి ప్రశ్నే ఊపిరి, ప్రశ్న ద్వారా జవాబుదారితనం వస్తుందని అన్నారు. ప్రశ్నించడం పౌరుల హక్కు, సమాధానం ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత ఇలాంటి గొప్ప అవకాశం కలిగించే చట్టం సమాచార హక్కు చట్టమని అన్నారు. సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేసే డీడీపీలోని సెక్షన్ 29(2) కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుద్ఘాతంతో గేదె మృత్యువాత



నవతెలంగాణ-కడెం

విద్యుద్ఘాతానికి గురై గేదె మృత్యువాత పడ్డ సంఘటన మండలంలోని చిన్న బెల్లాల్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గన్నే కొమురయ్య రైతుకు చెందిన గేదె విద్యుద్ఘాతానికి గురై మృత్యువాత పడింది. గేదె విలువ సుమారు రూ.40వేలు ఉంటుందని పేర్కొన్నారు. సంఘటన స్థలాన్ని జేఎల్ఎం నర్సయ్య సందర్శించారు.

ఒంటి కాలిపై జీపీ కార్మికుల నిరసన

నవతెలంగాణ-ఇచ్చోడ



గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగుతుంది. మంగళవారం 20వ రోజు ఒంటికాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఆ సంఘం నాయకులు కొలపక అశోక్ డిమాండ్ చేశారు. జీపీ ఉద్యోగ, కార్మికుల వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని జూలై 6 నుంచి సమ్మె కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రాజేశ్వర్, దుబాక నారాయణ, భూమారెడ్డి, లచ్చన్న, సాయమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

చదువుకోవాలంటే..

మోకాలు లోతు నీళ్లలో నడవాల్సిందే..



నవతెలంగాణ-ఇచ్చోడ

చదువుకోవాలంటే విద్యార్థులు మోకాలు లోతు నీళ్లలో నడవాల్సిందేనని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు విద్యార్థులు వెళ్లాలంటే జంకుతున్నారు. వర్షం పడిందంటే చాలు పాఠశాల ఆవరణలో మొత్తం నీరు చేరి. విద్యార్థులు నీళ్లకు బయపడుతున్నారు. కొందరు విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరవుతున్నారు. మంగళవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఈ పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితి దశాబ్ద కాలం నుంచి కొనసాగుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆవరణలోని నీటిని పంపించేందుకు మోటర్లు సైతం బిగించినప్పటికి ప్రయోజనకరంగా లేదని పేర్కొంటున్నారు. తరగతి గదిలోకి వెళ్లాలంటే మోకాలు లోతు నీళ్లలో నడువాల్సిందే. మంగళవారం రోజు విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందు వ్యాయప్రాయాసలతో తరగతి గదికి చేరుకుంటున్నారు. గేటు ఎక్కి కొందరు విద్యార్థులు, బారీకేడ్లు ఎక్కి ఇంకొంత మంది విద్యార్థులు తరగతి గదిలోకి వేళుతున్నారు.

ఆదాయం ఉన్నా వసతులు కరువు..

ఇచ్చోడ జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో సుమారు వెయ్యి మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆ పాఠశాల ప్రధాన రహదారికి ఆనుకొని ఉండటంతో వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసి వాటిని అద్దెకు ఇస్తారు. దీని ద్వారా పాఠశాలకు ఆదాయం సమకూరుతుంది. కాని పాఠశాల అభివృద్ధికి నోచుకోవడం లేదని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఆదాయం ఉన్న వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. మంగళవారం 24, 25 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా గత 20 రోజుల నుంచి గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నారని, వారిపట్ల ఈ రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలిచిన తర్వాత కూడా వీరి పట్ల మొండిగా వ్యవహరిస్తుందన్నారు. గ్రామపంచాయతీ కార్మికులు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. గతంలో ఐకేపీ వీఓఏలు కూడా సమ్మె చేశారని మంత్రి హామీనిస్తే సమ్మె విరమించారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడంతో రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు సమ్మెలు పోరాటాలు నిరసన కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి వీరి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, జిల్లా కోశాధికారి సునీత హాజరయ్యారు.

మిత్రుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఖానాపూర్

పదో తరగతి తమతో చదివిన చిన్ననాటి మిత్రుడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మిత్రులు ఆ కుటుంబాన్ని సహాయం చేయాలని నిశ్చయించుకుని మిత్రుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేసి ఉదారతను చాటుకున్నారు. 1998-99 టెన్త్ క్లాస్ బ్యాచ్‌కు చెందిన మిత్రులు అరుణోదయ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిత్రుడు గడ్డి శ్రీనివాస్ భార్య, కూతురు (గడ్డి లక్ష్మి) పేరిట రూ.55 వేలను ఫిక్స్ డిపాజిట్ చేసి పత్రాలను అందజేశారు. అయితే గత రెండు సంవత్సరాల కిందట మిత్రుడు గుండెపోటుతో ఇరాక్ దేశంలో మరణించారు. కూతురు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని-1 ఫస్ట్ క్లాస్ నుంచి టెన్త్ వరకు స్కూల్ ఫీజు లేకుండా పాపకు చదివిస్తానని అరుణోదయ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు విజేత స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్, ఎంఎం డిఫెన్స్ అకాడమీ నిర్మల్ జిల్లా డైరెక్టర్ అడిదెల రాజేశ్వర్, నాయిని సంతోష్, మామిడాల సుధాకర్, మదిరె శ్రీనివాస్, మిరియాల శ్రీనివాస్, గంగాప్రసాద్, లక్ష్మీ రాజం, సుమన్, రాజేంద్రప్రసాద్, మల్లేష్, రంజిత్‌లు అన్నారు. ముందు ముందు ఆ కుటుంబానికి అండగా నిలుస్తామని అన్నారు.

మణిపూర్‌లో ఆదివాసులపై ఆకృత్యాలను నిరసిస్తూ భారీ ర్యాలీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మణిపూర్‌లో ఆదివాసులపై ఆకృత్యాలను నిరసిస్తూ మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో టీఏజీఎస్ ఆధ్వర్యంలో బస్టాండ్ నుంచి కుమురం భీం చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్ర ఆదివాసీ ప్రజలపై జరుగుతున్న అనైతిక దాడులను, అత్యాచారాలను ఆపాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేస్తోందని అన్నారు. మణిపూర్‌లో ఆదివాసులపై జరుగుతున్న హింసను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, హింసను ఆపే ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వం ఉద్యేశ పూర్వకంగానే అభివృద్ధి చెందిన కులాలను మణిపూర్ స్థానిక ఆదివాసీలపైన ఉసిగొల్పిందని అన్నారు. ప్రధాని మోడీ, బీజేపీ నాయకత్వం మౌనం వహించడం అల్లరి మూకలకు బలం ఇచ్చిందని అన్నారు. చివరికి ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారాలు చేసి, హత్యలు చేశారని, ఆదివాసులపై దాడులు చేసి అడవులను ఖాళీ చేయించి, అక్కడి ఖనిజ సంపదలను కార్పొరేట్ శక్తులకు అప్పాజెప్పె ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని దాడులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు తొడసం భీంరావు, లంక రాఘవులు, బైరి సోమేశ్, రాష్ట్ర కమిటీ సభ్యులు, ఉయిక విష్ణు, ఆత్రం కిష్టన్న, మాడవి నాగోరావ్, కొవ సునీల్, మహేష్, కుంర దీపక్ ఆదివాసీ విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-ఖానాపూర్

రైతుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని బాదనకుర్తి రైతు వేదికలో సూర్యాపూర్, మస్కాపూర్, రైతులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు నిండుగా కరెంటు ఇచ్చే ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. సీఎం కేసీఆర్ పరిపాలనలో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉంటే ఓర్వలేని కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కేసీఆర్ మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వీటన్నింటినీ తిప్పి కొట్టి ప్రతిపక్షాలకు చెంపపెట్టు లాగా మరోసారి సీఎం కేసీఆర్‌ను గెలిపించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం అబివృద్ధి బాటలో పయనిస్తుంటే కాంగ్రెస్ టీపీసీసీ అధ్యక్షుడైన రేవంత్‌రెడ్డి మూడు గంటలు కరెంటు సరిపోదా అని అనడం సిగ్గుచేటని అన్నారు. సంక్షేమ పథకాలకు అడ్డుపడటం సమంజసమైంది కాదని అన్నారు. రానున్న రోజుల్లో రెండు పార్టీలకు ప్రజా యుద్ధంలో తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. అనంతరం ప్రజా ప్రతినిధులతో కలిసి రైతువేదిక వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అసత్యపు ఆరోపణలు చేయొద్దు

నవతెలంగాణ-కుభీర్



కేంద్రం ప్రభుత్వంపై అసత్యపు ఆరోపణలు చేస్తే ఉపేక్షించేది లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రావు పాటిల్ అన్నారు. పల్లె పల్లెకు బీజేపీ గడప గడపకు మోహన్‌రావు కార్యక్రమంలో భాగంగా మండలంలోని బెల్గాం తండా-1, బెల్గాం తండ-2, బెల్గాం గ్రామం, దార్‌కుభీర్ గ్రామాలలో మంగళవారం పర్యటించి, బీజేపీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర కుట్ర పూరితమైన పాలనను, కేంద్రం అందిస్తున్న మంచి పథకాలను క్యాలెండరు రూపంలో ప్రతి ఇంటికి ఇంటికి అందజేశారు. అనంతరం మోహన్ రావు పటేల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న పథకాలలో దాదాపు 80శాతం సబ్సిడీ కేంద్రం అందిస్తున్నదని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం కేంద్రంపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే బంగారు తెలంగాణ సాధ్యం అనడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్ చేస్తున్న అవినీతి అక్రమాలను అన్ని గమనిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి నాయకులు, మండల నాయకులు పడిపెల్లి గంగాధర్, అజయ్, బీజేపీ యువకులు, గ్రామ అధ్యక్షులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అయ్యేంతవరకూ ఉద్యమం



నవతెలంగాణ-బోథ్

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అయ్యేంతవరకు ఉద్యమాన్ని ఆపేది లేదని రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యులు అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 9వ రోజుకు చేరాయి. అలాగే ఈ దీక్షకు మద్దతుగా బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు అనిల్ జాదవ్ మద్దతు తెలిపారు. బోథ్ మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. అలాగే గిరిజన లంబాడి ఐక్యవేదిక ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ మద్దతు పలికారు. అలాగే బోథ్ మండల కేంద్రం నుంచి తరలి వెళ్లిన కార్యాలయాన్ని వెంటనే రప్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఫైర్ స్టేషన్ వివిధ సమస్యలను తీర్చేంతవరకు ఉద్యమాన్ని ఆపేది లేదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ సభ్యులు బోథ్ మండల అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

ముగ్గురు మట్కా నిందితుల అరెస్ట్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ముగ్గురు మట్కా నిందితులను అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జి సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాంసి బస్టాండ్ ఏరియాలో మట్కా ఆడుతున్నారని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డికి వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం సిసిఎస్ బృందం దాడి చేసింది. దాడిలో ముగ్గురు మట్కా నిర్వహిస్తుండగా పట్టుబడ్డారు. వసీం అత్తర్(బొక్కలగూడ), కనక సంతోష్(కిన్వట్), ఎస్కే జలీల్(కెఆర్‌కె) ముగ్గురిని అరెస్టు చేశారు. టూటౌన్ సిఐ అశోక్ కేసు నమోదు చేశారు. వీరి వద్ద నుండి మూడు సెల్ ఫోన్లు, రూ.4530 నగదు, మట్కా చిట్టీలు స్వాధీనం చేసుకున్నారు.

ముంపు బాధితులకు నిత్యావసర సరుకుల అందజేత




నవతెలంగాణ-బోథ్

మండలంలోని మర్లపల్లి గ్రామంలో ఇటీవలే కురుసిన భారీ వర్షాలకు గ్రామస్తుల ఇండ్లలలో వరద నీరు చేరాయి. మంగళవారం బీఆర్ఎస్ నియోజకర్గ నాయకుడు అనిల్ జాదవ్ బాధిత కుటుంబాలను కలిసి సందర్శించారు. అలాగే వారి ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకుల తడిసిపోవడంతో బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అలాగే ఈ కార్యక్రమానికి అనిల్ అన్న యువసైన్యం సభ్యులు అందరి మన్ననలు పొందుతూ ప్రతిఒక్కరికి సాయం చేస్తూ, నిత్యం నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంబాజీ రాథోడ్, నాయకులు సిరీస్, సంజు, ప్రవీణ్, వెంకటేష్, స్వామి డాక్టర్, నానక్ సింగ్, ఇచ్చోడ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు ముండే పాండురంగ్, దేవేంధర్‌రెడ్డి, ఇమ్రాన్, సుదీర్‌రెడ్డి, వెంకట్‌రావు, ప్రణయ్, వినయ్, బాబుసింగ్, బాపిరెడ్డి, రమేష్, అనిల్ అన్న యువ సైన్యం సభ్యులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా రైతు బీమా

- కోఆప్షన్ సభ్యుడు దత్తు హరి పటేల్



నవతెలంగాణ-కుభీర్

రైతుబీమాను అమలు చేసి తెలంగాణ ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోందని మండల కోఆప్షన్ సభ్యుడు దత్తుహరి పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని గోడపూర్ గ్రామానికి చెందిన జాటలే రాందాస్ రైతు గత కొన్ని రోజుల కింద గుండె పోటుతో మరణించారు. దీంతో వారి కుటుంబ సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతుబీమా పథకం కింద రూ.5లక్షలు అందజేశారు. వారి వద్ద నుంచి రైతుబీమా పత్రాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామంలో ఉన్న రైతులకు రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్‌తో పాటు వివిధ పథకాలు ప్రజలకు అందేలా ఎంతో కషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆనంద్‌రావు పటేల్, పంచాయతీ కార్యదర్శి కవిత, వ్యవసాయ విస్తీరణ అధికారి నారాయణ, మోతీరాం, బాబు, గ్రామస్తులు ఉన్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
www.navatelangana.com
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 26 జులై 2023

బీఎల్ఓలకు శిక్షణ తరగతులు

నవతెలంగాణ-భీమిని



ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలకు ఒక రోజు శిక్షణ తరగుతు నిర్వహించారు. 2024 ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదులో తీసుకోవల్సిన జాగ్రతలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణాధికారి వంశీకృష్ణ ఓటర్ జాబితాలో చేర్పులు మార్పులు కొత్త ఓటర్ నమోదు విధివిధానాలపై అవగాహన కల్పించారు. ఫామ్-6 ఫామ్-8 ఓటర్ నమోదు అనంతరం ఆన్‌లైన చేసే విధానం తదితర అంశాలపై బీఎల్ఓలకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ లక్ష్మీ రాజయ్య పాల్గొన్నారు.

'పోడుపట్టాలతో ఆదివాసుల చిరకాల ఆకాంక్ష నెరవేరింది'

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించిన పోడుపట్టాలతో ఆదివాసీల చిరకాల ఆకాంక్ష నేరవేరిందని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని లబ్ధిదారులకు ఎంపీడీఓ కార్యాలయంలో రౌటసంకెపల్లి వాసులకు పోడుపట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పోడు సాగుదారులకు పట్టాలు అందజేశామన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి సాగుదారులు పట్టాల కోసం ఇబ్బందులు పడుతున్నారని ఇదే సందర్భంలో వారిపై కేసులు కూడా నమోదు అయ్యాయన్నారు. ప్రస్తుతం జారీ చేసిన పోడు పట్టాదారులపై ఉన్న కేసులు ఎత్తివేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుంకరి మంగ పెంటయ్య, ఎంపీడీఓ శశికళ, సర్పంచ్ విమల కిష్టయ్య పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలపై ఆవుకు వినతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పంచాయతీ కార్మికులు తమ డిమాండ్లు పరిష్కరించాలని గత 20 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆవుకు వినతి పత్రం ఇచ్చి నరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 11వ పీఆర్సీ ప్రకారం బేసిక్ రూ.19,000 వేతనాలు చెల్లించాలని, జీవో నెంబర్ 60 ప్రకారం గ్రామపంచాయతీ సిబ్బందికి కేటగిరిల వారీగా వేతనాలు రూ.15,600, రూ.19,500 నిర్ణయించాలన్నారు. రూ.10 లక్షల జీవిత బీమ ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా గ్యారంటీ, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మాట్ల రాజు, సామయ్య, నాగేశ్వర్, కైలాస్, వీట్టు, శంకర్, పెంటుబాయి, యమున పాల్గొన్నారు.

జీపీ కార్మికుల రాస్తారోకో

రెబ్బెన : న్యాయమైన డిమాండ్ల సాధనకు జీపీ కార్మికులు చేపట్టి సమ్మె మంగళవారం 20వ రోజుకు చేరింది. నిరసనలో భాగంగా వామపక్షాల, జేఏసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్, బీఆర్ఎస్‌కేవీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగవెల్లి సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత తొమ్మిది సంవత్సరాల నుండి గ్రామ పంచాయతీ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. దేశంలోనే అత్యధికంగా వేతనాలు తీసుకొనే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సీలు, ప్రజా ప్రతినిధులు గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు దుర్గం వెంకటేశ్, రమేష్, శంకర్, ప్రసాద్, సునీల్, శ్రీనివాస్, ధర్మయ్య, పోచయ్య, మహేందర్, శోభ, లక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

వాంకిడి : మండలకేంద్రంలో జీపీ కార్మికులు చేపడుతున్న సమ్మె 20వ రోజుకు చేరుకున్న సందర్భంగా మంగళవారం జీపీ కార్మికులు నోటిలో గడ్డి పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు కట్టీరాం మాట్లాడుతూ ప్రభుత్వం 20 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ జీపీ కార్మికులను పట్టించుకోవడంలేదని, తమ డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మెను యదావిధంగా కొనసాగించడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

తాండూర్ : తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె 20వ రోజు కు చేరుకుంది. మంగళవారం ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యులు గ్రామ పంచాయతీ కార్మికులకు మద్దతుగా సమ్మెలో పాల్గొన్నారు. మల్టీపర్పస్ వర్కర్లుగా వారిని వెట్టి చాకిరి చేయించుకుంటు చాలీచాలని వేతనాలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు చంద్రశేఖర్, రామస్వామి, రాజు, సురేందర్, స్వామి, యాదవ్ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన నిందితులను శిక్షించాలి

నవతెలంగాణ-జన్నారం



మణిపూర్ ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. మణిపూర్ నిందితులను శిక్షించాలని కోరుతు, మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. మహిళలపై రోజు రోజుకు అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, అయినా ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్ రాష్ట్రంలో కార్పొరేట్ల కన్ను అడవులపై పడిందని, యురేనియం గ్రానైట్, విలువైన ఖనిజాలు ఈ అడవి ప్రాంతాల్లో ఉన్నందున వాటిని దోపిడీ చేయడానికి, మణిపూర్‌లో నివసిస్తున్న గిరిజన జాతులను(కుకి,నాగా) తరిమి వేయడానికి చట్టాల పేరుతో బీజేపీ దాడులను చేయిస్తోందన్నారు. మణిపూర్‌లోని హిందూ మతోన్మాదులు పెద్ద ఎత్తున ప్రభుత్వ అండతో మరణకాండను కొనసాగిస్తూ, వారి ఇండ్లను వారి ఆస్తులను ధ్వంసం చేస్తూ, వారి మాన, ప్రాణాలను హరిస్తున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను నగ్నంగా ఊరేగిస్తూ సామూహిక అత్యాచారాలు చేస్తూ చంపేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం ఈ విషయంపై నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందన్నారు. కూకీల ఊచకోత, పెద్ద ఎత్తున చర్చిల, కూల్చివేత వెనుక మత విద్వేషాలతో పాటు కార్పొరేట్ల దోపిడీ కుట్ర పన్నాగం కూడా ఉందన్నారు. ఏకంగా పోలీస్‌స్టేషన్‌లో ఆయుధాలను దోచుకొని పోతున్నారని ప్రభుత్వం నుంచి చర్యలు ఏమీ లేవన్నారు. బీజేపీ ప్రోద్బలంతో ఘర్షణలు జరుగుతున్నాయని బీజేపీ ఎమ్మెల్యే పౌలింలాల్ హౌ కీప్ కూడా చెప్పున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు కనికరం అశోక్, మండల కమిటీ సభ్యులు కే.బుచ్చయ్య, కే.లింగన్న, జి.రాజన్న, ఎం జయ, పీ.విజయ శంకర్, ప్రమీల, మౌనిక, కనకయ్య, ఆత్రం రాజు, రవి పాల్గొన్నారు.

రేపటి నుంచి నవోదయ క్లస్టర్ స్థాయి క్రీడా పోటీలు

- తొమ్మిది విద్యాలయాల నుంచి 200 మంది హాజరు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ రాష్ట్రంలోని తొమ్మిది జవహర్ నవోదయ విద్యాలయాలకు సంబంధించిన క్లస్టర్ స్థాయి క్రీడాపోటీలకు కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయం వేదిక కానుంది. ఈ పోటీలు 27, 28 తేదీలలో రెండు రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యినట్లు విద్యాలయం ప్రిన్సిపల్ బి.చక్రపాణి తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయాల స్థాయిలో ఇప్పటికే ఎంపిక చేసిన క్రీడాకారులు క్లస్టర్ స్థాయి క్రీడా పోటీలలో పాల్గొననున్నారు. వాలీబాల్, బాస్కెట్ బాల్, హ్యాండ్‌బాల్ అండర్-14, 17, 19 బాలురు, బాలికల విభాగాలలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. మొత్తంగా 200 మంది వరకు క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొననున్నారు.

దక్షిణ భారత స్థాయికి ఎంపిక

క్లస్టర్ స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను దక్షిణ భారత దేశ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేస్తారు. దక్షిణ భారత స్థాయికి ప్రతీ క్లస్టర్ నుండి ప్రతీ విభాగం నుండి ఎనిమిదేసి జట్లు వెళుతాయి. వాలీబాల్ పోటీలను కర్ణాటక రాష్ట్రంలోని హవేరిలో, బాస్కెట్ బాల్ పోటీలు కేరళ రాష్ట్రంలోని కాసరఘాడ్‌లో, హ్యాండ్ బాల్ పోటీలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరంలో ఆగష్టు మూడు నుండి ఐదో తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ పోటీలలో ఎంపికైన జట్లు జాతీయ స్థాయిలో పాల్గొంటాయి.

ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభం

ఈ పోటీలను గురువారం సిర్పూరు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపల్ చక్రపాణి తెలిపారు. జేకే పేపర్ మిల్స్ యూనిట్ హెడ్ అమరేంద్రకుమార్ మిశ్రా ఈ కార్యక్రమానికి హాజరు కానున్నట్లు తెలిపారు.


పోటీలకు సిద్ధమైన క్రీడా మైదానం

సిజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో చింతగూడ పంచాయతీ ప్రజలు సీజనల్ వ్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శి కుమ్మరి హరీష్ తెలిపారు. చింతగూడ గ్రామపంచాయతీలో మంగళవారం సర్పంచ్ ఆత్రం సంజీవ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతు లోతట్టు ప్రాంత ప్రజల ఇండ్లలో నీరు చేరినా, పాత ఇండ్లు కూలిపోయే స్థితిలో ఉంటే వెంటనే గ్రామపంచాయతీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. దోమలు ఎక్కువై మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్య, డెంగ్యూ లాంటి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉన్నందున, వ్యాధులు దరిచేరకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజేశ్వరి, కళ్యాణి, ఆశ కార్యకర్త భారతి, కారోబార్ మహేష్, గ్రామ కోఆప్షన్ సభ్యుడు రావుల రాజయ్య పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఏర్పడే వరద పరిస్థితులపై లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎగువ ప్రాంతాలతో పాటు జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వరద పరిస్థితులు ఏర్పడనున్నాయని, ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, అత్యవసర సేవల నిమిత్తం ప్రజల సౌకర్యార్థం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 9490534721, 9640378197 నెంబర్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని, ఏదైనా అత్యవసర సేవలకు ప్రజలు సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలోని ప్రాణహిత నదితో పాటు పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున అధికార యంత్రాంగం ప్రత్యేక రక్షణ చర్యలు చేపడుతుందని, ప్రజలు ఎవరు వెళ్లకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రజలు సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి పోలీసుల చేయూత



నవతెలంగాణ-రెబ్బెన

పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం గంగాపూర్ గ్రామానికి చెందిన నాయిని వెంకటి పెంకుటిల్లు గత నాలుగు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు కూలిపోవడంతో తీవ్ర ఆస్తినష్టం వాటిల్లింది. ఈ విషయం తెలుసుకున్న రెబ్బెన ఎస్సై ఎల్ భూమేష్ బాధిత కుటుంబానికి క్వింటల్ నర బియ్యం, నిత్యవసర వస్తువులు, రూ.వెయ్యి నగదును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పందిర్ల మధునయ్య, ముంజం వినోద, ఇగురపు సంజీవ్ పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా పడ్డ భారీ వృక్షం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని మహమ్మదాబాద్, రోటి గూడ గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారిపై కురుస్తున్న వర్షాలకు భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో ఆ రెండు గ్రామాలకు రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సౌకర్యం నిలిచిపోవడంతో ఆశాఖ అధికారులు విద్యుత్ పునరుద్ధరింపజేశారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న వృక్షాన్ని తొలగించడానికి స్థానిక పోలీసులు మంగళవారం అజ్మీర తిరుపతి ఆధ్వర్యంలో చర్యలు చేపట్టి చెట్టును తొలిగించారు.

కేసీఆర్ చిత్రపటానికి వీఆర్ఏల పాలాభిషేకం

నవతెలంగాణ-జన్నారం

వీఆర్ఎలకు పేస్కేల్ ఇస్తూ సీఎం కేసీఆర్ జీఓ జారీ చేయడంతో మండల కేంద్రంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్ఏలు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు, రాజశేఖర్ మాట్లాడుతూ, భూముల విషయాల్లో గ్రామాల్లో ప్రభుత్వ అధికారులకు, చేదోడు వాదోడుగా ఉంటూ సమస్యలు పరిష్కరించడంలో తమ పాత్ర ఎనలేనిదన్నారు. చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం, వీఆర్ఏలను క్రమబద్ధీకరిస్తూ ఇతర శాఖలలో పంపించడం ఎంతో శుభ పరిమాణం అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన వీఆర్ఏలు, రాజ్ కుమార్ శ్రీనివాస్ రాజలింగు రాజమౌళి, మమతా రాజకళా పాల్గొన్నారు.



రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలి

నవతెలంగాణ-నస్పూర్



గనులలో రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీయం కేహెచ్ఎన్ గుప్తా అన్నారు. మంగళవారం ఆర్కే-6 గనిలో భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు తగ్గించుటకు సురక్షిత పని విధానాలు, పరిస్థితుల అమలుపై దృష్టి సారించాలన్నారు. నా భద్రత నా బాధ్యత, నా భద్రతే నా కుటుంబ బాధ్యత అనే నినాదాన్ని పాటించాలని సూచించారు. ఏబీసీడీ సేఫ్టీ కల్చర్ను గుర్తుంచుకోవాలని, రక్షణ అనేది ఇంటి నుంచి మొదలవ్వాలని, ద్విచక్ర వాహనంపై వస్తున్నప్పుడు హెల్మెట్ ధరించాలని కోరారు. శ్రీరాంపూర్ ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, ఆర్కే-5,6 గ్రూప్ ఏజెంట్ ఏవి రెడ్డి మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలోనే కాకుండా కంపెనీ స్థాయిలో ఆర్కే-6 గని రక్షణతో కూడిన ఉత్పత్తిలో ముందంజలో ఉందని కొనియాడారు. ఇదే ఒరవడిని కొనసాగించాలని కోరారు. గని ఉత్పత్తి లక్ష్యాన్నే కాకుండా రక్షణపై అవగాహన కార్యక్రమాలు ప్రతిరోజు ఉద్యోగులకు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఇంజనీర్ వీరన్న, రామగుండం రీజియన్ డీజీఎం ఎస్ఎంటీసీ శర్మ, ఎస్ఓఎం తిరుపతి, గని రక్షణాధికారి శ్రీనివాస్, సంక్షేమ అధికారి సునీల్ కుమార్, ఫిట్ ఇంజనీర్ అందే శ్యామ్, ఇంజనీర్ మహేష్, వెంటిలేషన్ ఆఫీసర్ నర్సయ్య, సర్వే ఆఫీసర్ వర్మ, డిప్యూటీ మేనేజర్ కొమురయ్య పాల్గొన్నారు.

29న ఇందిరా పార్కు ఎదుట చేపట్టే దీక్షను విజయవంతం చేయాలి

- పీఆర్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే ప్రకాష్



నవతెలంగాణ-కెరమెరి

317జీఓకు వ్యతిరేకంగా ఈ నెల 29న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు ఎదుట చేపట్టే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే ప్రకాష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిరసనకు సంబంధించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికత ఆధారంగా సొంత జిల్లాలకు ఉద్యోగ, ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు క్రాంతి కుమార్, శ్రీకాంత్, సురేష్, వినోద్, బాలకృష్ణ, శివప్రసాద్, కృష్ణకాంత్, ఆకాష్, సంతోష్, లింగయ్య, వివేక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-తాండూర్

ఉపాధ్యాయ, విద్యారంగంలో నెలకొన్న పరిష్క సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టపాస్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్‌కు ఉపాద్యాయులు వినతి పత్రం అందజేశారు. బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలని భాషాపండితులు, పీఈటీలు 317 జీఓ ద్వారా స్థానికతను కోల్పోయిన వారికి సొంత జిల్లాలకు బదిలీ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ ఏరియర్స్, జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ రుణాలు, మెడికల్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు నెలల డీఏలు వెంటనే చెల్లించాలని, 2002, 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని, ఐఆర్, పిఆర్సీని వెంటనే ప్రకటించాలని అన్నారు. కేజీబీవీ, మోడల్ స్కూల్, గిరిజన సంక్షేమ పాఠశాల ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని, ఎఫ్ఏసీ హెడ్మాస్టర్లు, ఎఫ్ఏసీ ఎంఈఓలు ఉన్నచోట ఒక అదనపు ఉపాధ్యాయున్ని నియమించాలని, ఉన్న ఖాళీలలో విద్యా వాలంటీర్ లను నియమించాలని, ప్రతీ పాఠశాలకు పారిశుధ్య కార్మికులను ఇవ్వాలని, ఉచిత విద్యుత్తు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ జిల్లా కార్యదర్శి భారతి అశోక్, మండల అధ్యక్షుడు రమేష్, విశ్వేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు సత్యనారాయణ, సుధాకర్‌రెడ్డి, గోపి పాల్గొన్నారు.

పద్మశాలీలను ప్రభుత్వం ఆదుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

పద్మశాలీలను ప్రభుత్వం ఆదుకోవాలని పద్మశాలి సంఘం మండలంలోని కిష్టాపూర్ గ్రామ నూతన అధ్యక్షుడు వాసాల నరేష్ అన్నారు. మంగళవారం కిష్టాపూర్ గ్రామంలో పద్మశాలి సంఘం గ్రామ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వాసాల నరేష్, ఉపాధ్యక్షులుగా, గంగారపు మల్లేష్, క్యాషియర్‌గా హనుమండ్ల వేణు, సిద్ధం లచ్చన్న, ఇతర కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. పద్మశాలీలు ఐక్యమత్తంగా ఉంటేనే తమ హక్కులను సాధించుకోవచ్చని సూచించారు.

పారదర్శకంగా క్వార్టర్ కౌన్సెలింగ్

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులకు చేంజ్ ఆఫ్ క్వార్టర్ కౌన్సిలింగ్ మంగళవారం ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో పారదర్శకంగా నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్‌లో 73 మంది మంత్లీ రేటెడ్ ఉద్యోగులు పాల్గొన్నారు. 33 మంది క్వార్టర్లను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం రఘుకుమార్, డీజీఎం పర్సనల్లు అరవింద రావు, ఏ.రాజేశ్వర్, డీజీఎం (ఈఅండ్ఎం)మల్లయ్య, డీవై పీఎం రాజేశ్వర్ రావు, సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గుండె రావు, సీనియర్ అసిస్టెంట్ లక్కాకుల శ్రీధర్ పాల్గొన్నారు.

వర్షాకాలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

వర్షాకాలం నేపథ్యంలో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ జి.వెంకట నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపార్ట్మెంట్, కమర్షల్ బిల్డింగ్స్, సెల్లార్స్ లోతట్టు ప్రాంతములో ఉన్న ఇంటి యజమానులు సెల్లార్లో ఉన్న కరెంట్ మీటర్లు, వైర్లు ఉంటే గ్రౌండ్ ఫ్లోర్ లేదా మొదటి ఫ్లోర్ లోకి మార్చాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న ఇంటి యజమానులు సురక్షితమైన ప్రదేశానికి వెళ్లాలని లేదా క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఉండవచ్చని తెలిపారు. క్యాతనపల్లి పట్టణ పరిధిలో గల ప్రజల సౌకర్యము మేరకు ప్రతి రోజు 24 గంటలు అందుబాటులో కంట్రోల్ రూం ఏర్పాటు చేయడమైనదని ఆయన తెలిపారు. సహాయక చర్యల కోసం క్యాతనపల్లి పురపాలక సంఘం ఇ.వసంత్(శానిటరీ ఇన్స్‌పెక్టర్) 8309960731 బి.సంతోష్‌కుమార్ (ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్) 9848384948, ఎం.చంద్రయ్య (జవాన్) 9959904450 నెబర్లను సంప్రదించాలని కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని కొమ్ముగూడెంలో కరెంట్ స్తంబాలు వంగి విద్యుత్తు వైర్‌లు వేలాడుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంతోష్ తెలిపారు. అచలాపూర్ నుండి కొమ్ముగూడెం వెళ్లే విద్యుత్తు లైన్ అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. రైతులు, పశువుల కాపరులు, గ్రామస్తులు భారీ వర్షాలకు ఎప్పుడు ఏం జరుగుతుందో నని ఆందోళన చెందుతున్నారన్నారు. విద్యుత్ అధికారులుస్పందించి విద్యుత్తు లైను నుసరి చేయాలని ఆయన కోరారు.

అదుపుతప్పి కాలువలో కారు బోల్తా

నవతెలంగాణ-కోటపల్లి



చెన్నూరు మండలంలోని కిష్టంపేట గ్రామ సమీపంలోని జాతీయ రహదారి పక్కన కల్వర్టు వద్ద మంగళవారం కారు అదుపుతప్పి బోల్తా పడింది. భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్‌కు చెందిన ఐలయ్య యాదవ్ మంచిర్యాల నుండి కిష్టంపేట మీదగా జాతీయ రహదారిపై కారులో వెళుతున్న క్రమంలో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కాలువలో పడింది. కారులో ఉన్న ఐలయ్య ప్రమాదం నుంచి బయటపడ్డాడు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-దహెగాం



రైతుబీమాకు ప్రతి ఒక్కరు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓలు శోభన్, వెన్నెల అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు బీబ్రా గ్రామంలో రైతుబీమా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుబీమాకు ఆగస్టు ఐదో తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పట్టాదారు పాస్ పుస్తకంతో పాటు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా, నామిని ఆధార్‌కార్డును జతపరచాలని సూచించారు. కార్యక్రమంలో బీబ్రా సర్పంచ్ బండ కృష్ణమూర్తి, రైతు సమన్వయ సమితి సభ్యులు నాయికిని లక్ష్మణ్ రైతులు పాల్గొన్నారు.

చినుకు పడితే రాకపోకలు బంద్



నవతెలంగాణ-కోటపల్లి

చిన్నపాటి వర్షానికే వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు. మండలంలోని పారుపల్లి గ్రామ సమీపంలో కల్వర్టు చిన్న వర్షానికి ఎత్తిపోస్తూ వాహనాలను దాటనీయకుండా చేస్తోంది. దీంతో అటువైపుగా ఉన్న లింగన్నపేట, ఎదులబంధం, సిర్సా, రొయ్యలపల్లి, ఆలుగామ, జనగామ, సూపాక, వెంచపల్లి, నందరంపల్లి, గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. పాఠశాలకు వెళ్లే ఉపాధ్యాయులకు, ఏదైన అత్యవసరం మీద పట్టణానికి వెళ్లే వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఉపాధ్యాయులు చెన్నూరు పట్టణం నుండి గ్రామాలకు ప్రతిరోజు వాహనాలపై వస్తుంటారు. కల్వర్టుపై వరద ప్రవాహం తగ్గేంత వరకు వేచి ఉండక తప్పట్లేదు. దీంతో విద్యార్థులు ఉపాధ్యాయులు వచ్చేంత వరకు పాఠశాల ఆవరణలో ఆడుకుంటూ గడపాల్సి వస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తే రోగులు అవగోస పడుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-తాంసి

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగిఉండాలని డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే అన్నారు. మంగళవారం మండలంలోని పొన్నారి ప్రాథమి ఉన్నత పాఠశాలలో డీఎల్‌ఎస్‌ఏ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఆర్థిక స్తోమత లేని నిరుపేదలు కేసుల్లో ఉంటే న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా వాదిస్తామని అన్నారు. విద్యార్థులకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించడం పిల్లలు ఎలాంటి నేరాలు పాల్పడకుండా పెద్దలు వారికి అవగాహన కల్పించాలన్నారు. చిన్న వయసులో ద్విచక్ర వాహనాలు నడపకుండా పెద్దలు మార్గదర్శకం చేయాలని అన్నారు నేరాలకు పాల్పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అండె అశోక్, వైస్ ఎంపీపీ ముచ్చ రేఖారఘు, ప్రధానోపాధ్యాయులు సంజీవరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు గడుగు దేవమ్మ, గంగమ్మ, నాయకులు గంధం రమణ, లింగారెడ్డి, చంద్రన్న పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ



నవతెలంగాణ - దహెగాం

గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మెలో భాగంగా మంగళవారం వారసంతలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సెండ రమేష్ మాట్లాడుతూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 20 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు రవి, రాజ్‌కుమార్, బాబాజీ, సాయికృష్ణ పాల్గొన్నారు.

ఉచిత కంటి శిబిరాలకు స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లో మంగళవారం వేర్వేరుగా నిర్వహించిన రెండు ఉచిత నేత్ర వైద్య శిబిరాలకు స్పందన లభించింది. స్థానిక కిమ్స్ ఆసుపత్రిలో శ్రీకొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి 20 మంది హాజరు కాగా అందులో ఎనిమిది మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి బెల్లంపల్లి లయన్స్ క్లబ్ సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, అనిత తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్తామలజిస్టులు వసీ, గోపి పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక ప్రజాలైఫ్‌కేర్ ఆసుపత్రిలో ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి 20 మంది హాజరు కాగా ఇందులో 12 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వారికి విడతల వారీగా అపరేషన్లు చేయించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. కంటి శుక్లాలు ఉన్న వారు, కంటి చూపు మందగించిన వారు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

దరఖాస్తుదారులు అందుబాటులో ఉండాలి

నవతెలంగాణ-తాండూర్

58 ,59 జీవో ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు అందుబాటులో ఉండాలని రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎజాజూద్దీన్ తెలిపారు. మంగళవారం తాండూర్ గ్రామపంచాయతీలోని సుభద్ర కాలనీలో రెవిన్యూ బృందంతో కలిసి సర్వే నిర్వహించారు. 58 59 జీవోలో ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ కోసం రెవెన్యూ టీం సర్వే నిర్వహిస్తున్నందున దరఖాస్తుదారులు అందుబాటులో ఉండాలని కోరారు. మొత్తం 230 మంది క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకోగా 105 మంది లబ్ధిదారుల ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణాల వివరాలను పొందుపరిచినట్లు ఆయన తెలిపారు. సర్వే బృందంలో ఆడిట్ ఆఫీసర్ శ్రీనివాస్, డిప్యూటీ తాహసిల్దార్ ప్రకాష్, రెవెన్యూ సిబ్బంది వేణు, దిగంబర్, విజయ్ పాల్గొన్నారు.

సవారీ బంగ్లాకు జనరేటర్ అందజేత

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని రుయ్యాడి గ్రామ హస్సేన్ హుస్సేన్ సవారీ బంగ్లాకు రూ. 5లక్షల విలువ చేసే జనరేటర్‌ను మంగళవారం అదే గ్రామానికి చెందిన జనరేటర్ దాత లోక విష్ణువర్ధన్ రెడ్డి అందించగా, విజయ డెయిరీ మాజీ చైర్మెన్ లోక భూమారెడ్డి చేతుల మీదుగా హస్సేన్ హుస్సేన్ సవారీ బంగ్లాకు జనరేటర్ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పోతారెడ్డి, గ్రామస్తులు అశోక్, భూమన్న, శ్రీనివాస్, భీమన్న, నిమ్మల పెదరాజారెడ్డి, గోక సంజీవరెడ్డి పాల్గొన్నారు.

వామపక్షాల ఆధ్వర్యంలో

మణిపూర్ ఘటనపై ఆందోళన

- కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మణిపూర్ ఘటనను నిరసిస్తూ ఆదిలాబాద్ పట్టణంలో వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో పాత జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. మణిపూర్‌లో శాంతియువ వాతావరణం నెలకొల్పాలంటూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఆదివాసీ మహిళలపై అనైతిక దాడులు, అత్యాచారాలు, హింసాకాండ కొనసాగుతున్నా మోడీ మౌనం వీడకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ కుట్రలో భాగంగానే మణిపూర్‌లో అల్లర్లు జరుగుతున్నాయని అన్నారు. మేతి తెగను ఆదివాసులుగా మార్చడం కోసం, రిజర్వేషన్లు ఎత్తివేయడం కోసమే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. పార్లమెంట్ సమావేశాల్లో అల్లర్ల ఘటనలపై చర్చ జరగాలని ప్రతిపక్షాలు పట్టుబడుతున్నా స్పందించడంలేదన్నారు. సభ్యసమాజం తలదించుకునేలా మహిళలను నగ్నంగా ఊరేగించినా ఏమాత్రమూ పట్టకపోవడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, లంక రాఘవులు, భీంరావు, సీపీఐ జిల్లా నాయకులు ముడుపు నళినిరెడ్డి, కుంటాల రాములు, అరుణ్ కుమార్ నాయకులు ఉన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. మంగళవారం డిఆర్‌ఓ రాజేశ్వర్‌తో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ జాబితా తయారీపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 18 సంవత్సరాలు వయసు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటు నమోదు చేసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా జిల్లాలోని ఆదివాసీ, పిటిజి ప్రజలు, మహిళలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు అందరూ తమ ఓటు నమోదు చేసుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఓటరు జాబితా రూపకల్పనలో బూత్ స్థాయి అధికారులకు రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సహకారం అందించాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల వారు బూత్ స్థాయిలో ఏజెంట్లను నియమించాలని తెలిపారు. ఒకే పోలింగ్ కేంద్రంలో 1300 మంది ఓటర్లు దాటినట్లయితే సమీపంలో అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ఒకే ఇంట్లో అర్హత కలిగిన ఓటర్లు అందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చే విధంగా జాబితా రూపొందించాలని, ఇందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు తగు సూచనలు సలహాలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిటిలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఆర్పీ-1 గనిలో ప్రమాదం.. కార్మికునికి గాయాలు

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పి-1 గనిలో మంగళవారం తెల్లవారుజామున ప్రమాదం చోటుచేసుకుంది. గనిలో కోల్ కట్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నోముల సత్తయ్య(58) రాత్రి షిఫ్ట్‌లో బి సిమ్, 32 డిప్, 6 లెవెల్ దగ్గర పనిచేస్తుండగా మిస్ ఫైర్ కావడంతో అతడి రెండు కళ్ళు దెబ్బతిన్నాయి. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి గోదారి భాగ్యరాజు మాట్లాడుతూ గనిలో ప్రమాదం జరగడం అధికారుల నిర్లక్ష్యమేనని, ప్రతిరోజు కార్మికుడు తన స్వియరక్షణతో పనిచేయాలని తెలిపే అధికారులు, పని స్థలాల్లో జరిగే ప్రమాదాలను గుర్తించకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఎస్‌డీఎల్ మిషన్ బాటమ్ దగ్గర ఉలి కొట్టమని చెప్పడం వల్లనే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ప్రమాదానికి



గురైన కార్మికుడిని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఏరియా అధ్యక్షుడు గుల్ల బాలాజీ, నాయకులు తోడే సుధాకర్ పరామర్శించారు.

ఆదివాసుల హక్కులు కాపాడాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చట్టబద్ధతలేని గిరిజనులను ఎస్టీ జాబితా నుంచి తొలగించి ఆదివాసులకు రాజ్యాంగ బద్ధంగా సంక్రమించిన హక్కులను కాపాడాలని ఆదివాసీ నాయకుడు, ఎంపీ సోయం బాపురావు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌కు విన్నవించారు. మంగళవారం ఆదివాసీ నాయకులు, ఆధార్ సొసైటీ బృందం ఎంపీ సోయం బాపురావుతో కలిసి ఢిల్లీలో కేంద్రమంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. చట్టబద్ధతలేని గిరిజన తెగలను ఎస్టీ జాబితా నుండి తొలగిస్తేనే, ఆదివాసుల హక్కులకు ఎలాంటి ప్రతిబంధకం ఏర్పడదని తెలిపారు. ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టులో కేసు విచారణ దశలో స్పెషల్ లీవ్ పిటిషన్‌కు సంబంధించి కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర మంత్రికి విన్నవించారు. అదేవిధంగా ఏజెన్సీ ఉద్యోగాలు ఆదివాసులకే దక్కేలా జీఓ నెంబర్ 3 కేసు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కేసులో కూడా కేంద్ర ప్రభుత్వం చొరవ చూపి కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర మంత్రికి విన్నవించారు. ఎంపీ సోయం బాపురావు వెంట, ఆదివాసీ ప్రతినిధి బృందం నాయకులు చుంచు రామకృష్ణ, కురుసం సీతారాములు, పోడియం బాలరాజు పాల్గొన్నారు.

యూనియన్ బలోపేతానికి కృషి చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఫోటో, వీడియో గ్రాఫర్స్ యూనియన్ బలోపేతానికి ప్రతీ సభ్యుడు కృషి చేయాలని యూనియన్ కాగజ్‌నగర్ అధ్యక్షుడు అనుమల్ల రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి కుందారపు రాజు సూచించారు. మంగళవారం స్థానిక పటేల్ గార్డెన్‌లో యూనియన్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర యూనియన్ అమలు చేస్తున్న కుటుంబ భరోసా పథకం గురించి యూనియన్‌లో ప్రచారం చేయాలని సూచించారు. సభ్యుడు మృతి చెందిన సమయంలో యూనియన్ ఆధ్వర్యంలో ఆ కుటుంబానికి రూ.1.50 లక్షలు చెల్లిస్తున్నారని, ఇందుకు గాను ప్రతీ సభ్యుడు కేవలం రూ.10 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో 66 మంది కుటుంబాలకు ఈ ప్రయోజనం అందిందని వివరించారు. అనంతరం నూతనంగా సభ్యత్వం తీసుకున్న వారికి గుర్తింపు కార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి జూపాక నారాయణ పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-వాంకిడీ

మండలంలోని నూతనంగా పట్టా పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు రైత బీమాకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారి మిలింద్‌కుమార్ మంగళవారం తెలిపారు. గతంలో పట్టా పాస్ పుస్తకాలు ఉండి పేర్లు నమోదు చేసుకోని రైతులు వచ్చే నెల ఆగస్టు మూడో తేదీలోగా ఏఈఓలను సంప్రదించి రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీనికి సంబంధించిన వివరాల కోసం వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

రేపు న్యాక్ బృందం పర్యటన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలను జూలై 27, 28 తేదీల్లో జాతీయ అంచనాలు ప్రమాణాల సంస్థ (న్యాక్) బృందం సందర్శించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డా.జలగం అనిత, సమన్వయ కర్త షేక్ ముజీబ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాక్ బృందంలో బనారస్ హిందూ విశ్వవిద్యాలయం (బిహెచ్‌యూ), వారణాసి (యూపి) మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆచార్యులు రాజ్ కుమార్ అధ్యక్షులుగా, తుంకూర్ విశ్వవిద్యాలయం, తుమకూరు (కెఎన్) ఆర్థికశాస్త్ర పరిశోధన ఆచార్యులు సమన్వయ సభ్యులుగా, లయోలా కళాశాల, మెట్టెల (టిఎన్) ప్రిన్సిపాల్ జేవియర్ వేదం సభ్యులుగా వ్యవహరించనున్నట్టు తెలిపారు. ఈ బృందం కళాశాల అందిస్తున్న కోర్సులు, బోధనా సౌకర్యాలు, మౌలిక వసతులు, పరిశోధన, విద్యార్థుల విజయాలు, గ్రంథాలయం, ప్రయోగశాలలు, క్రీడా సౌకర్యాలు, పరీక్షా ఫలితాలు తదితర అంశాలను పరిశీలించి, కళాశాలకు గ్రేడును సిఫారసు చేయనున్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి

నవతెలంగాణ-తాంసి



భారీ వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు డాక్టర్ వన్నెల అశోక్ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మంగళవారం భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలో భారీ వర్షాలకు పెన్‌గంగా ఉధృతి కారణంగా పంట పొలాలు దెబ్బతిని కొట్టుక పోయిన పంటలను మండల నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రైతులకు కేవలం రైతుబంధు ఇచ్చి చేతులు దులుపుకోవడం సరైంది కాదని అన్నారు. రైతులకు రావాల్సిన పంట నష్ట పరిహారం సబ్సిడీలు ఫాసల్ బీమా పథకలు లేకుండా చేసిందని అన్నారు. భీంపూర్ మండలంలో భారీ వర్షాలకు అనేక గ్రామాలు నీట మునిగి పంటలకు అపరా నష్టం వాటిల్లిందని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు కంటి తుడుపుగా వచ్చి వెళ్లి పోయారని అన్నారు. వెంటనే నష్టపోయిన పంటలను సంబంధిత అధికారులతో సర్వే చేసి రైతులకు నష్టపరిహారం అందించాలని అన్నారు. లేకపోతే రైతులు పక్షాన కాంగ్రెస్ పార్టీ నిలబడి మండలంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, రజవాలి, రాంరెడ్డి, కిషన్ ఉన్నారు.

శోభాయామానంగా కావడి యాత్ర

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లో మంగళవారం కావడి యాత్రను శోభాయామానంగా నిర్వహించారు. దేశంలోని వివిధ పుణ్యక్షేత్రాల నుండి తీసుకువచ్చిన నదీ జలాలతో ఈ యాత్ర చేపట్టారు. ముందుగా స్థానిక హన్మాన్ మందిర్‌లో పూజలు నిర్వహించారు. అనంతరం నదీ జలాలతో భక్తి పాటలు పాడుతూ ఈజ్‌గాం శివమల్లన్న స్వామి ఆలయం వరకు ఈ యాత్ర కొనసాగింది. అనంతరం శివమలన్నస్వామి దేవాలయంలో నదీ జలాలతో అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, కావడి యాత్ర నిర్వహణ సమితి సభ్యులు ప్రయాగ్‌తివారి, అతుల్ గోహిల్, శశిలోయ, జవాహర్, పవన్ బల్దేవా, విలాస్ షరాఫ్, మహిళలు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమ్మెతో పడకేసిన పారిశుధ్యం

నవతెలంగాణ-కౌటాల



గత 20 రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని సమ్మె నిర్వహించడంతో గ్రామాల్లో పారిశుధ్యం రాజ్యమేలుతోంది. మంగళవారం మండలంలోని తాటిపెల్లి గ్రామ పంచాయతీలోని ఆవాస గ్రామం బీవరేటిలో ఈజీయస్ కూలీలతో పారిశుధ్య పనులను సర్పంచ్, ఉప సర్పంచ్, కార్యదర్శులు దగ్గరుండి చేయించారు. రోడ్డుకు ఇరువైపుల నిల్వవున్న నీటిని తొలగించి పారిశుధ్య పనులు చేపట్టారు. జీపీ కార్మికులు విధుల్లో చేరకుంటే వర్షాకాలం పారిశుధ్యం లోపించి విష జ్వరాల బారిన పడే అవకాశముందని, దీనిపై ప్రభుత్వం స్పందించి జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించి విధుల్లో చేరేల చర్యలు తీసుకోవాలని సర్పంచ్, ఉప సర్పంచ్ పేర్కొన్నారు.

పాఠశాలల పనివేళల మార్పు సరికాదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల పనివేళలను మార్పు చేస్తూ విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులు సరికాదని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.స్వామి, వి.అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.00 గంటలకు బదులుగా, 9.30 గంటలకు ప్రారంభించటం అశాస్త్రీయమని అన్నారు. పని వేళలు మార్చాలంటే నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి విద్యార్థులు, తల్లిదండ్రులు తదితర భాగస్వాముల అభిప్రాయాలను సేకరించి నిర్ణయించాల్సి ఉంటుందని తెలిపారు. విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చిన సందర్భంలో ఆ విధంగా చర్చించి, నిర్ణయించిన ప్రస్తుత పనివేళలను ఏమాత్రం చర్చ లేకుండానే మార్పు చేయటం విచారకరమని పేర్కొన్నారు. ఈ మార్పు కొద్దిమంది ఉపాధ్యాయులకు ఉపయోగపడవచ్చునేమో కానీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఏమాత్రం ఉపయోగకరం కాదని తెలిపారు. ఈ నిర్ణయం ప్రభుత్వ పాఠశాలలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదుపై ప్రభావం చూపుతుందని తెలిపారు. కనుక రాష్ట్ర విద్యాశాఖ పాఠశాలల పనివేళలల మార్పుపై ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

వేతన బకాయిలు చెల్లించాలని వాచర్ల ధర్నా

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తమకు వేతన బకాయిలు చెల్లించాలని అటవీ శాఖకు చెందిన వాచర్లు, డ్రైవర్లు, ఆపరేటర్లు మంగళవారం కాగజ్‌నగర్ అటవీ డివిజన్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న తమకు ఆ వేతనాలు కూడా సక్రమంగా చెల్లించడం లేదని అన్నారు. ఏప్రిల్ నెల నుండి వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. వేతనాల చెల్లింపు కోసం వచ్చిన నిధులను అధికారులు ఇతర పనులకు మళ్లిస్తుండడంతోనే ఈ పరిస్థితి తలెత్తుతోందని వారు ఆరోపించారు. అనంతరం సూపరింటెండెంట్ విలాస్‌రావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సత్యనారాయణ, అంకుష్, మల్లేష్, సోమయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలని

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎండీ రెహీమొద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటివరకు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోని వారు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

ఉప్పొంగిన వాగులు వంకలు

నవతెలంగాణ-కోటపల్లి

కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని కత్తెరసాల, నారాయణపూర్, రాయిపేట, సుద్దాల, బుద్ధారం, సంకారం, గ్రామాల సమీపంలోని వాగులు మంగళవారం ఉప్పొంగి ప్రవహించాయి. అక్కేపల్లి గ్రామానికి వెళ్లే దారిలోని వాగు ఉప్పొంగి ప్రవహించడంతో రోడ్డు డ్యామ్ పైనుంచి మీరు ప్రవహించింది. దీంతో రెండు గంటలపాటు రాకపోకలు నిలిచిపోయాయి. పంట చేలలో వర్షపు నీరు నిలుస్తుంది.

మిషన్ భగీరథ పనుల పరిశీలన



నవతెలంగాణ-కౌటాల

మండలంలోని గుడ్లబోరి, కనికీ, సాండ్‌గాం గ్రామాల్లో టాటా ట్రస్టు బృందం సభ్యులు చిటోరి వాసు, సుస్మిత, పద్మాకర్ కలిసి మూడు గ్రామాల్లో మిషన్ భగీరథ పనులను పరిశీలించారు. వారితో ఏపీడీ శ్రీనివాస్, టాస్క్ జిల్లా మేనేజర్ సాయికుమార్, ఏపీఎం వెంకటరమణ, ఏఓ రాజేష్‌తో కలిసి గ్రామాలను పరిశీలించి పలు సమస్యలపై అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్ర రీజినల్ మేనేజర్ టాటా ట్రస్టు సభ్యులు రైతులకు డైరి కోళ్ల, చేపల పెంపకందారుల స్థితిగతులపై సర్వే నిర్వహించారు. గుడ్లబోరి గ్రామ పంచాయతీలో రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. వారి వెంట వ్యవసాయ విస్తరణ అధికారులు ఉన్నారు.

ఇన్‌స్పైర్ నామినేషన్‌లు పంపాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్‌మానక్ నామినేషన్లు, జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి అయిదు నామినేషన్లు కచ్చితంగా పంపాలని డీఈఓ ప్రణీత పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ, ప్రయివేటు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులతో పాటు సైన్స్, గణిత, సోషల్ ఉపాధ్యాయులతో జూమ్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. నామినేషన్ల దరఖాస్తుకు కేంద్రం కొత్తగా ప్రవేశ పెట్టిన ఇన్‌స్పైర్ మానక్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. విద్యార్థులు ఆలోచనలను ఆగస్టు 31లోగా నమోదుచేయాలని సూచించారు. నామినేషన్ల నమోదు, ప్రాజెక్టుల ఎంపిక విధానాలపై ఇన్‌స్పైర్, మొబైల్ యాప్‌పై సైన్సు అధికారి రఘురమణ అవగాహన కల్పించారు. ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు తమ పరిధిలోని పాఠశాలలు కచ్చితంగా పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికారులు, పల్లె సృజన ఫౌండర్ బ్రిగేడియర్ గణేషన్, ఎస్సీఈఆర్టీ ప్రొఫెసర్ సురేష్‌బాబు, రిసోర్స్ పర్సన్స్‌లు అరె భాస్కర్, మనోహర్‌రెడ్డి, భౌతిక శాస్త్ర ఫోరం ప్రధాన కార్యదర్శి ఎస్.చంద్ర శేఖర్ పాల్గొన్నారు.